# నక్కపల్లి భూసేకరణలో తోడేళ్ళ న్యాయం

అభివృద్ధి అనేది ప్రజలకి శాపం కాకూడదు. కాని మన రాష్ట్రంలోనూ జిల్లాలోనూ తరచూ జరుగుతున్నది అదే. ఒక్క పరిశ్రమ స్థాపన కోసం కొన్ని వందల మంది భూములు వదులుకోవాల్సిన స్థితి, మరికొన్ని వందల మంది జీవనోపాధిని కోల్పోవాల్సిన దుస్థితి. మనందరి అభివృద్ధి కోసం తమ భూముల్నీ, జీవనాధారాలనూ పోగొట్టుకుంటున్నవారితో పాలకులు ఎంతో బాధ్యతతోనూ, ఉదారంగానూ వ్యవహరించాలని మనం ఆశిస్తాము. చట్టప్రకారం వారికి నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరుకుంటాము. కాని వాస్తవం అందుకు పూర్తి విరుద్ధంగా వుంది. భూసేకరణ కోసం చట్టంలో ఎన్ని నియమాలు వున్నా ప్రభుత్వాలు మోసపూరితంగానే రైతుల భూములు లాక్కుంటున్నాయి. నక్కపల్లి మండలంలో చందనాడ, వేంపాడు, డి.ఎల్.పురం, రాజయ్యపేట గ్రామాలలో జరుగుతున్నదిదే. పది పన్నెండు సంవత్సరాల క్రితం అచ్యుతాపురం, రాంబిల్లిలలో జరిగింది కూడా ఇదే.

నక్కపల్లి మండలంలో కోస్టల్ కారిడార్ నిర్మాణం కోసం ఈ నాలుగు గ్రామాల్లో భూమిని సేకరిస్తామంటూ 2010 లోనే భూసేకరణ చట్టం-1894, సెక్షన్ 4-1 కింద ప్రభుత్వం పత్రికలలో నోటీసు జారీ చేసింది. ఈ ప్రకటన వచ్చిన వెంటనే రైతులు కోస్టల్ కారిడార్ కోసం తమ భూములను ఇవ్వబోమని ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక సదుపాయాల కల్పనా సంస్థ (ఎపిఐఐసి) స్పెషల్ డిప్యూటి కలెక్టర్ గారికి తమ అభ్యంతరాలను లిఖిత పూర్వకంగా తెలియజేసారు. రైతుల అభ్యంతరాలపై ఎటువంటి చర్య తీసుకోకుండానే తాను సేకరించబోయే భూముల వివరాలను తెలుపుతూ సెక్షన్-6 కింద ప్రభుత్వం రెండవ నోటీసును జారీ చేసింది. రైతులంతా తమ భూములు ఇవ్వకూడదని నిర్ణయించుకుని హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు రైతులకు అనుకూలంగా స్టే ఇచ్చింది. ఆ తరువాత కోర్టులో వాదోపవాదాలు కొనసాగుతున్న దశలో రెండు ముఖ్యమైన మార్పులు చోటు చేసుకున్నాయి. 2013లో కొత్త భూసేకరణ చట్టం వచ్చింది. 2014లో తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది.

అధికారంలోకి రావడం మొదలు తెలుగు దేశం ప్రభుత్వం 'రాష్ట్రాభివృద్ధికి పరిశ్రమలే దిక్కు' అనే ప్రచారాన్ని ఉధృతం చేసింది. రాష్ట్ర విభజన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా నష్టపోయిందనీ, ఆ నష్టాన్ని పూడ్చాలంటే రైతులు పరిశ్రమల కోసం భూములు వదులుకోక తప్పదని చెప్పడం మొదలు పెట్టింది.ఇటీవలి కాలం వరకు ప్రతిపాదనలో వున్న విశాఖపట్నం-కాకినాడ కోస్టల్ కారిడార్ (పి.సి.పి.ఐ.ఆర్-PCPIR) తన పేరు మార్చుకొని కొత్త పేరుతో ముందుకొచ్చింది. దానిని ఇపుడు విశాఖపట్నం-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ (వి.సి.ఐ.సి-VCIC) అంటున్నారు. నక్కపల్లిలో పాత కోస్టల్ కారిడార్ కోసం అప్పటికే భూమిని గుర్తించి వున్నారు గనక ఆ భూమినే విశాఖపట్నం-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం సేకరించాలని ప్రభుత్వం భావించింది. అయితే అప్పటికే అమలులోకి వచ్చిన 2013 భూసేకరణ చట్టాన్ని తుంగలో తొక్కి ప్రభుత్వం అన్యాయంగా, మోసపూరితంగా భూసేకరణ ప్రారంభించింది.

**మోసపూరిత భూసేకరణ**

కొత్త భూసేకరణ చట్టం అమలు మాట సరే, పాత చట్టం ప్రకారం కూడా ప్రభుత్వం నియమాలను పాటించలేదు. అడుగడుగునా నియమాల ఉల్లంఘనకు పాల్పడింది. రైతులందరూ భూములివ్వకూడదని పట్టుమీదవున్నారు గనక ఎలాగైనా వారిని లొంగదీసుకునే ఎత్తుగడలను అవలంబించింది. మొట్టమొదట అధికార పార్టీకి చెందిన కొందరిని చేరదీసి వారికి ఇతర ప్రయోజనాల ఆశ కల్పించింది. ఆ తరవాత, వ్యాపారాలూ ఉద్యోగాలూ చేసుకుంటూ ఆదాయం కోసం ఇక్కడి భూములమీద ఆధారపడని రైతులను ఎంచుకుంది. ఈ రైతులు చవకగా భూములు అమ్ముకోవడానికి సిద్ధపడ్డారు. కొత్త భూసేకరణ చట్టంలో పేర్కొన్నట్టు మార్కెట్ విలువ కంటే మూడు రెట్లు ఎక్కువగా నష్ట పరిహారం (ఎకరానికి రూ.18 లక్షలు) ఇస్తామని చెప్పి, ఒప్పించి ప్రభుత్వం వీరితో అంగీకారపత్రాలు రాయించుకుంది. ఎప్పుడైతే కొద్దిమంది ఒప్పుకున్నారో దాన్ని ఆసరాగా చేసుకుని రెవెన్యూ అధికార్లు మిగతావారి మీద వత్తిడిపెట్టారు. రకరకాలుగా బెదిరించి, భయపెట్టి ఒప్పించారు. ఇది ఒక ప్రజాప్రభుత్వం చెయ్యవలసిన పనేనా? మన ముఖ్యమంత్రి ఎప్పుడూ గొప్పగా చెప్పుకునే పారదర్శక పాలన ఇదేనా? బహుశా ప్రైవేటుగా జరిగే భూలావాదేవీలు ఇంతకంటే మెరుగ్గా ఉంటాయేమో. ప్రజాప్రయోజనాల కోసం ప్రజల భూమిని తీసుకునే హక్కు తనకున్నదని ప్రభుత్వం భావిస్తున్నప్పుడు వారి శ్రేయస్సును చూసే బాధ్యతను అది గాలికి వదిలేయకూడదు కదా! నక్కపల్లిలో ఇప్పుడు జరుగుతున్నదిదే.

**ఒప్పుకోలు అవార్డు**

ఎంతో ఉదారదృష్టితో మార్కెట్ విలువకంటే మూడురెట్లు అధికంగా నష్టపరిహారం ఇస్తున్నట్లు ప్రభుత్వం చాటుకోవడం పచ్చి మోసం తప్ప మరేమీ కాదు. ఎందుకంటే ప్రస్తుత మార్కెట్ విలువకంటే అది చాలా తక్కువని అందరికీ తెలుసు. ఇప్పుడు తీసుకోకపోతే తరవాత ఇది కూడా దక్కదనే భయాందోళనలు సృష్టించి అందరినీ లొంగదీసుకున్నారు. అంతేకాకుండా దాన్నే ప్రజలందరి సమ్మతితో చేసుకున్న 'ఒప్పుకోలు అవార్డు' గా ప్రకటించారు.

1992 నాటి 'ఆంధ్రప్రదేశ్ భూసేకరణ (సంప్రదింపుల కమిటీ) నియమాల'లో ఒప్పుకోలు అవార్డు ప్రక్రియ వున్న మాట నిజమే. అయితే దీని ప్రకారం ఒక జిల్లాస్థాయి సంప్రదింపుల కమిటీ, ఒక రాష్ట్రస్థాయి సంప్రదింపుల కమిటీ ఉంటాయి. జిల్లా కలెక్టర్ సెక్షన్ 11 ప్రకారం అవార్డును ప్రకటించాక ఎవరైనా సంప్రదింపుల కమిటీ ముందుకు వచ్చి తమ అభ్యంతరాలను తెలపవచ్చు. నష్టపరిహారాన్ని పెంచే అధికారం రాష్ట్రస్థాయి కమిటీకి వుంటుంది. ఈ ప్రక్రియ అంతా సవ్యంగా జరిగిన తరువాత మాత్రమే సెక్షన్ 11(2) ప్రకారం ఒప్పుకోలు అవార్డును

ప్రకటించాలి. ఇంకా ఎవరికైనా అభ్యంతరాలు వుంటే కోర్టుకు పోవచ్చు. కాని నక్కపల్లి ప్రాంతంలో ఇదేమీ జరగలేదు. నేరుగా ఒక ధరను ప్రకటించి "మీరు దీనికి ఒప్పుకుంటే సరే, లేదంటే మార్కెట్ ధర చెల్లిస్తాము. అది కూడా కోర్టులో జమ చేస్తాము. మీరు కోర్టుల చుట్టూ సంవత్సరాల తరబడి తిరగండి" అని బెదిరించి, భయపెట్టి సంతకాలు తీసుకున్నారు. దశలవారీగా నష్టపరిహారం ఇస్తామని చెబుతూ పలుకుబడి ఉన్నవారికీ, పెద్ద రైతులకూ ముందుగానే చెల్లించి మిగతా ప్రజలను మరింత ఆందోళనకూ భయాలకూ గురి చేస్తున్నారు.

**దళితులూ రైతుకూలీలకు వట్టి చెయ్యే**

జిరాయతీ భూములున్న వారి పరిస్థితే అంత దారుణంగా వుంటే ఇక డి.పట్టా (అసైన్డ్) భూములున్న దళితుల పరిస్థితి గురించి చెప్పనక్కరలేదు. వారిని కూడా అదే పద్ధతిలో భయపెట్టి ఎకరాకు రూ.12.5 లక్షలు ఇస్తామని సంతకాలు తీసుకున్నారు. జీవనోపాధిని కోల్పోతున్న భూమిలేని రైతుకూలీల, ఇతర వృత్తుల వారి గోడు ఎవరూ పట్టించుకోవడం లేదు. కొత్తగా 2013లో వచ్చిన భూసేకరణ చట్టం ప్రకారం గానీ లేదా గతంలో 1894లో జారీ చేసిన జిఓ 1307 ప్రకారం గానీ ఎసైన్మెంట్ భూమికి కూడా స్వంత భూమికిచ్చినట్లే మార్కెట్ ధరతోపాటు 30% సొలేషియం (పరిహారం) కలిపి ఇవ్వాలి.

కొత్త భూసేకరణ చట్టం-2013 వచ్చి నాలుగేళ్ళు గడిచినా ప్రభుత్వం ఇంకా పాత చట్టాన్నే అనుసరించింది. ఆ ప్రక్రియలో కూడా ప్రభుత్వం ఎన్నో తప్పిదాలకు పాల్పడింది. సెక్షన్-6 కింద ఏఏ భూములు సేకరించబోయేదీ తెలుపుతూ నోటీసు ఇచ్చిన రెండేళ్ళ లోపలే అవార్డును ప్రకటించాలి. రెండు సంవత్సరాలు దాటిపోయినట్లైతే ఈ భూసేకరణ ప్రక్రియచెల్లదు. అయినప్పటికీ ప్రభుత్వం చెల్లని ప్రక్రియనే అనుసరించడం ఎంత వరకు ఉచితం? దీన్ని ఎవరైనా కోర్టులో సవాలు చెయ్యవచ్చు.

**కొత్త చట్టం ఏమంటుంది?**

భూమినీ, బ్రతుకులనీ కోల్పోతున్న చందనాడ, వేంపాడు, రాజయ్యపేట, డిఎల్‌పురం వాసులు తెలుసుకో వలసిన విషయాలు ఎన్నో వున్నాయి. భూసేకరణ కోసం ఇంతవరకూ బ్రిటిష్ కాలం నాటి 1894 చట్టాన్నే ఉపయోగిస్తూ వచ్చారు. ఆ చట్టంవల్ల భూనిర్వాసితులకు జరిగిన అన్యాయాల్ని ప్రశ్నిస్తూ ఎన్నో ప్రజా ఉద్యమాలు జరిగాయి. ప్రజల జీవించేహక్కు ప్రాతిపదికగా చట్టాన్ని మార్చాలనీ, అభివృద్ధిలో ప్రజల్ని భాగస్వాముల్ని చేయాలనీ ఆ ఉద్యమాలు డిమాండ్ చేశాయి. వాటన్నిటి ఫలితంగానే 2013లో కొత్త భూసేకరణ చట్టం వచ్చింది. దాని పేరే 'భూసేకరణ, పునరావాస ప్రక్రియలలో పారదర్శకత, న్యాయమైన నష్టపరిహార హక్కుచట్టం-2013'. ఈ చట్టంలో న్యాయమైన పరిహారాన్ని ఒక హక్కుగా మొట్టమొదటిసారి గుర్తించారు. అలాగే భూసేకరణ అంశాన్నీ, పునరావాస, నష్టపరిహార అంశాల్నీ ఇది మొదటిసారిగా కలిపి చూసింది. ఈ చట్టం ఏమి చెబుతుందో ఒకసారి చూద్దాం.

- ఇకపై ప్రజల, గ్రామ సభల సమ్మతి లేనిదే భూసేకరణ జరపరాదు. ప్రైవేటు సంస్థల కొరకు భూమిని సేకరిస్తే 80 శాతం మంది సమ్మతి వుండాలి. ప్రభుత్వ - ప్రైవేటు భాగస్వామ్యం కొరకు సేకరిస్తే 70 శాతం మంది ఒప్పుకోవాలి.
- ఏదైనా ప్రాజెక్టును చేపట్టే ముందు 'సామాజిక ప్రభావ అంచనా'నూ, దానితోపాటుగా 'పర్యావరణ ప్రభావ అంచనా'నూ తప్పనిసరిగా నిర్వహించాలి. దానివల్ల అక్కడ నివసిస్తున్న ప్రజలకూ, పర్యావరణానికీ జరగగల హానిని నివారించగలం.
- భూములకిచ్చే నష్టపరిహారం అప్పుడున్న మార్కెట్ రేటుకన్నా మూడు లేదా నాలుగు రెట్లు ఉండాలి. దీనికోసం మార్కెట్ రేటును జిల్లా కలెక్టర్ సవరించాలి. దానికి తోడుగా బలవంతంగా భూమిని స్వాధీనం చేసుకుంటున్నందుకు 30 శాతం పరిహారం (సొలేషియం) అదనంగా ఇవ్వాలి.
- దళితులకూ, బడుగులకూ ఇచ్చిన డి.పట్టా భూమికి కూడా జిరాయతీ భూమికి ఇచ్చినట్టుగానే నష్టపరిహారం ఇవ్వాలి.
- ఈ ప్రాజెక్టు వల్ల ప్రభావితం అవుతున్న వారందరూ పునరావాసానికి అర్హులే.అంటే కేవలం భూమి వున్నవాళ్లేకాక, అక్కడ నివసిస్తున్న భూమి లేని నిరుపేదలు, రైతుకూలీలు, ఇతర వృత్తుల వారందరూ ప్రాజెక్టు ప్రభావితుల జాబితాలోకి వస్తారు. వారందరికీ వివిధ స్థాయిలలో నష్టపరిహారంతోపాటు నివాస వసతి ఏర్పాటు చెయ్యవలసిందే.
- జీవనోపాధి కోల్పోతున్నవారికి ప్రాజెక్టులో ఉద్యోగంగాని లేదా ఒకో కుటుంబానికి ఇరవయ్యి సంవత్సరాల పాటు నెలకు రూ.2000 భృతిగానీ చెల్లించాలి.
- చేతివృత్తుల వారికి, చిన్న వ్యాపారస్తులకు ఒకే విడత నష్టపరిహారంగా రూ.25,000 ఇవ్వాలి.
- ఇతర ప్రాంతాలకి తరలించబడే కుటుంబాలకి రవాణా ఖర్చుల నిమిత్తం రూ.50,000తో పాటు పునఃనివాసానికి మరొక రూ.50,000 చెల్లించాలి.

ఎన్నో ఉద్యమాల ఫలితంగా ప్రజలకు కాసింత ఉపశమనం కలిగించే ఈ చట్టం నక్కపల్లి గ్రామాలలో అమలుకు నోచుకోలేదు. రాబోయే కాలంలో విశాఖపట్నం-చెన్నై పారిశ్రామిక కారిడార్ కోసం ఇంకా కొన్ని వేల ఎకరాలు సేకరించబోతున్నారు. ఇప్పటికే 3700 ఎకరాలు సేకరించారు. ప్రజల అమాయకత్వాన్నీ, అవగాహనా రాహిత్యాన్నీ ఆసరాగా చేసుకుని ప్రభుత్వం సాగిస్తున్న ఈ భూదందాకి ప్రజలే అడ్డుకట్ట వెయ్యాలి. జరిగిన మోసాన్ని ప్రజలు గుర్తించి, తమ హక్కులను తెలుసుకుని, ముందు ముందు నష్టపోకుండా భూసేకరణ అధికార్లనూ, రాజకీయ నాయకులనూ నిలదీయాలి.


మానవహక్కుల వేదిక

**Human Rights Forum (HRF)**

**06-12-2017**

విశాఖపట్నం


*ప్రచురణకర్త : వి.ఎస్.కృష్ణ, 9440411899*